మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం

● ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



చీపురుపల్లి: బోరు డ్రిల్లింగ్ పనులకు శంఖుస్థాపన చేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ సచివాలయం-1 పరిధిలో తాగునీటి కోసం హ్యాండ్ బోరు ఏర్పాటుకు మండల పరిషత్ నిధులు రూ.1.20 లక్షలు మంజూరయ్యారు. బోరు డ్రిల్లింగ్ పనులను ఎంపీ బెల్లాన సోమవారం పూజలు చేసి ప్రారంభించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి, రోడ్లు, వీధి కాలువల నిర్మాణానికి త్వరితగతిన నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. మౌలిక వసతుల విషయంలో ప్రజలకు ఎక్కడ ఎలాంటి అవసరం ఉన్నా తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పతివాడ రాజారావు, నాయకులు కొసిరెడ్డి రమణ, కర్రోతు రమణ, దాలయ్య, మహేష్, రాము పాల్గొన్నారు.

ఇంటింట కుళాయిల పనులకు భూమిపూజ

లక్కవరపుకోట: జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా మండలంలోని గనివాడ, గంగుబూడి, నిడుగట్టు గ్రామాల్లో ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులకు ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు సోమవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో సుమారు రూ.15.56 కోట్లతో ఇంటింట కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మించామని, పలుగ్రామాల బీటీ రోడ్లను పునరుద్ధరించామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పల్లెలను పూర్తిగా విస్మరించిందని గుర్తుచేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చంద్రకళ మాట్లాడుతూ గంగుబూడి, నిడుగట్టు, గనివాడ గ్రామాల్లో రూ.31 లక్షలతో ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులను ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తిచేస్తామని తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు గొలగాని హరిప్రసాద్, రవ్వ శివశంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కోసూరి పెదరమణ, నమ్మి చిన్నబాబు, గేదెల సూరినాయుడు, రంది ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



లక్కవరపుకోట: గుంగుబూడిలో కుళాయిల పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

రూ.3 లక్షలతో శ్మశాన వాటికకు సీసీరోడ్డు

గజపతినగరం: మండలంలోని ఎం.వెంకటాపురం గ్రామ బీసీ కాలనీ శ్మశానవాటికకు సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 లక్షల ఉపాధి హామీ నిధులను మంజూరు చేసిందని మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బెల్లాన త్రినాథరావు తెలిపారు. రోడ్డు పనులకు స్థానిక వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడుతో కలిసి సోమవారం ఆయన భూమిపూజ చేశారు. ఈసందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూశ్మశాన వాటికకు సీసీరోడ్డు లేక పోవడంతో వర్షాకాలంలో ఇబ్బందులుపడుతున్నామని ఎం.వెంకటాపురం బీసీ కాలనీ వాసు లు ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక దృష్టికి తీసుకురావడంతో, సమస్యను ఆమె ఎమ్మెల్యే బొత్స అప్పలనరస య్యకు వివరించారని చెప్పారు. ఎమ్మెల్యే స్పందించి నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. స్థానిక నాయకులు కర్రి నానాజీ, గురుగుబిల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరం: ఎం.వెంకటాపురం బీసీ కాలనీ శ్మశానవాటిక సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

పార్టీ కోసం సైనికుల్లా పనిచేయాలి



పార్టీ యువజన విభాగం సభ్యులతో జెడ్పీటీసీ నరసింహమూర్తి, జైహింద్‌కుమార్

గంట్యాడ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ యువ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని జెడ్పీటీసీ వర్రి నరసిం హమూర్తి, పార్టీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ సూచించారు. నరవ గ్రామంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం సమావేశం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేయడానికి ప్రతీ కార్యకర్త శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. టీడీపీ, జనసేన నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని అన్నారు. ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ రామసూర్యం, లక్కిడాం పీఏసీఎస్ అధ్యక్షుడు లచ్చిరెడ్డి కృష్ణ, నరవ సర్పంచ్ పతివాడ భాస్కరరావు, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు కొండెల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న వంశీకృష్ణ

చీపురుపల్లి: పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు అందజేయడంతో పాటు ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో 41 మంది లబ్ధిదారులకు పట్టణంలోని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కార్యాలయంలో సోమవారం ఆయన ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ఇప్పటికే చీపురుపల్లి మేజర్ పంచాయతీలో ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి పెద్ద లేఅవుట్ వేసిందని చెప్పారు. ఈ లేఅవుట్‌లో వెయ్యి మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలతో పాటు పక్కా ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇంకా అర్హులు ఉంటే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాజాం పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, స్థానిక నాయకులు కొసిరెడ్డి రమణ, కరణపు ఆది, రాము, రమేష్, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



పతకాలు సాధించిన కేజీబీవీ విద్యార్థినులతో ఎస్‌ఓ జ్యోతి

జామి: దశమానందం సేవాసదన్ వారు గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రతిభా పరీక్షల్లో మండలంలోని కుమరాం కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఈపరీక్షల్లో విద్యార్థినులు పి.ప్రసన్న, పి.దేవీప్రియ, జి.రాధిక, జె.ధన లక్ష్మి, పి.మౌనిక, పి.రమ్య బంగారుపతకాలు సాధించారని కేజీబీవీ ఎస్‌ఓ బి.జ్యోతి తెలిపారు. కేజీబీవీలోనే నిర్వహించిన పరీక్షలకు 8,9,10వ తరగతుల విద్యార్థినులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ చెప్పారు. విద్యార్థినులను ఉపాధ్యాయినులు పి.పుష్ప, తదితరులు అభినందించారు.

పాతకాలువ ద్వారానే సాగునీరు అందించండి



గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు కప్పేసిన కాలువను పరిశీలిస్తున్న ఎం.కొత్తవలస రైతులు

బొండపల్లి: ఎం.కొత్తవలసలోని మజ్జివాని చెరువుకు జె.గుమడాం ఫీడర్ కొండవాగు నుంచి గతంలో ఉన్న సాగునీటి(పైపులైను)కాలువ ద్వారానే నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన పలువురు రైతులు కోరారు. గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కప్పేసిన కాలువను రైతులు సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనుల్లో భాగంగా గుమడాం గ్రామానికి ఎగువన ఉన్న కొండవాగు నుంచి ఎం.కొత్తవలస మజ్జివాని చెరువులోకి సాగునీరు సరఫరా చేసే పైపు లైన్లను హైవే అధికారులు పూర్తిగా కప్పివేశారని అన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు కొద్ది దూరంలో కాలువ నుంచి ఐటీబీ కాలువను నిర్మించారని, కాలువ కంటే ఐటీబీ నిర్మాణం ఎత్తుగా ఉండడం వల్ల కింద ఉన్న మజ్జివాని చెరువుకు పూర్తిస్థాయిలో సాగునీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు కింద ఉన్న 250 ఎకరాలకు సాగునీరు అందడం ప్రశ్నార్థకంగా మారిందని రైతులు అంటున్నారు. కప్పేసిన కాలువను పునరుద్ధరించాలని వారు కోరారు. గ్రామ సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, రైతులు మజ్జి అప్పారావు, కర్రోతు జనార్దనరావు, కొవ్వాడ అప్పలనాయుడు, శిగనం అప్పలనాయుడు, పతివాడ మురళి, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

దత్తిరాజేరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందికి ఎంపీడీఓ చంద్ర కుమారి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో సచివాలయ సిబ్బందితో సోమవారం ఆమె సమావేశమ య్యా రు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 17 సచివాలయాల పరిధిలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులను సచివాలయాలకు రప్పించి రిజిస్ట్రేషన్లు చేయించే బాధ్యత సచివాలయ కార్యదర్శులపై ఉందన్నారు. ఇళ్ల రిజిస్ట్రేషన్ పూర్తి ఉచితంగా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు బానాదిలో వైద్యశిబిరం

వేపాడ: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా మండలంలోని బానాది గ్రామ సచివాలయంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఇన్‌చా ర్జి ఎంపీడీఓ జి.ఉమ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో నలుగురు స్పెషలిస్టు వైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యసేవలందిస్తారని పేర్కొన్నారు. సచివాలయ పరిధి ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

11న కోమటిపల్లిలో ఆసరా సంబరాలు

దత్తిరాజేరు: మండలస్థాయి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలను ఈనెల 11వ తేదీన కోమటిపల్లి రైల్వే గేట్ పక్కనున్న లేఅవుట్‌లో నిర్వహించనున్నట్లు ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు సోమవారం తెలిపారు. ఆసరా సంబరాలకు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని డ్వాక్రా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విద్యా సామగ్రి వితరణ



విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న టీచర్ పద్మావతి, ఆమె కుమారులు

శృంగవరపుకోట: మండలంలోని సీతంపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మాజీ ఎంపీటీసీ కొర్రాయి స్వామినాయు డు జ్ఞాపకార్థం ఆయన భార్య, ఉపాధ్యాయిని పద్మావతి సోమవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. 90 మంది విద్యార్థులకు సుమారు రూ.10వేల విలువైన నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర సామగ్రి అందజేశారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామ ఏఎంజీ కాలనీ సమీపంలో ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.గంట్యాడ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మజ్జి గణపతిరావు తెలిపిన వివరాలు...బొండపల్లి మండలం జె.గుమడాం గ్రామానికి చెందిన బొత్స అప్పలరాజు విశాఖపట్నంలో టిఫిన్ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కుమార్తె రజస్వల ఫంక్షన్‌కు స్వగ్రామానికి వారం రోజులు క్రితం వచ్చాడు. ఈనెల 4వ తేదీన రాత్రి గుమడాం నుంచి పల్సర్ బైక్ పై బయలు దేరి విజయనగరం వెళుతుండగా నరవ ఏఎంజీ కాలనీ సమీపంలో విజయనగరం నుంచి వస్తున్న కారు ఢీకొట్టడంతో తల కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో 108 సిబ్బంది విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరు గైన చికిత్స కోసం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు వైద్యులు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

కొబ్బరి చెక్కలకు బహిరంగ వేలం



వేలం నిర్వహిస్తున్న దేవదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారికి భక్తులు నైవేద్యంగా సమర్పించిన కొబ్బరి చెక్కలు, మొక్కులు చెల్లించుకున్న జాకెట్ ముక్కలను పోగు చేసుకునేందుకు దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పి.వి.లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవేలం పాటలో భక్తులు ద్వారా వచ్చే కొబ్బరి చెక్కల్లో సగం పోగు చేసుకునేందుకు పెదపాడుకు చెందిన కె.తిరుమలరావు రూ.1.15 లక్షలకు, జాకెట్ ముక్కలు పోగు చేసుకునేందుకు సీతారాంపురానికి చెందిన జి.స్వామి రూ.1,01 లక్షలకు దక్కిం చుకున్నారు. అమ్మవారి దేవస్థానం ఈఓ జి.శ్రీనివాస్, చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్, సభ్యుడు వంకల కృష్ణ పాల్గొన్నారు.


గిరిజన ఆశ్రమ పాఠశాల సందర్శన



కొండగంగుబూడి ఆశ్రమ పాఠశాలలో ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులను ఆరా తీస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఎంఈఓ బాలభాస్కరరావు సోమవారం సందర్శించారు. పాఠశాలను పదోతరగతి పరీక్షల కేంద్రంగా ఎంపిక చేయడంతో అక్కడి తరగతిగదులు, ఫర్నీచర్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలను పరిశీలించారు. ఎనిమిదో తరగతి విద్యార్థుల కు ప్రభుత్వం అందజేసిన బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లను విద్యార్థులు వినియోగిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం పి.కె.ఆర్.పురం, రామస్వామిపేట, బొద్దాం ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల నోట్, వర్క్ బుక్స్, లెసెన్ ప్లాన్ పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

కంటి ఆపరేషన్లకు 25 మంది ఎంపిక



వృద్ధుడికి నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్

వేపాడ: స్థానిక పాలకేంద్రం వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో సోమవారం నేత్రవైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో శంకర్ ఫౌండేషన్‌కు చెందిన ఆప్తాలమిక్ 65 మందికి కంటి పరీక్షలు చేసి, 25 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేయించి, కళ్లద్దాలు అందజేస్తామని క్యాంపు కో-ఆర్డినేటర్ జోగారావు తెలపారు.

గ్రంథాలయానికి కుర్చీలు, పుస్తకాల వితరణ



లైబ్రేరియన్ రామారావుకు కుర్చీలు అందజేస్తున్న పద్మలత, కామేశ్వరరావు

గుర్ల: స్థానిక శాఖా గ్రంథాలయానికి హ్యూమన్ రైట్స్ సంస్థ సభ్యురాలు పద్మలత, ఏఎస్‌ఐ కామేశ్వరరావు రీడింగ్ కుర్చీలు, పోటీ పరీక్ష ల పుస్తకాలను సోమవారం అందజేశారు. దాతలకు లైబ్రేరియన్ రామారావు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు, యువత గ్రంథా లయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దివ్యాంగుడికి బ్యాటరీ ట్రైసైకిల్ అందజేత



దివ్యాంగుడికి బ్యాటరీ ట్రైసైకిల్ అందజేస్తున్న వంశీకృష్ణ

చీపురుపల్లి: ఎంపీ ల్యాడ్స్ నిధులతో సమకూర్చిన బ్యాటరీ ట్రైసైకిల్‌ను గరివిడి మండలం, ఏనుగువలసకు చెందిన ఓ దివ్యాంగు డికి వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ సోమవారం అందజేశారు. చీపురుపల్లిలోని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వంశీకృష్ణ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని చెప్పారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తన ఎంపీ ల్యాడ్స్ నిధులతో దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొసిరెడ్డి రమణ, ముల్లు పైడిరాజు, డబ్బాడ జగదీష్ పాల్గొన్నారు.

సత్తా చాటిన జామి మండల యువత



జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన జామి సచివాలయం-3 జట్టు

జామి: 'ఆడుదాం- ఆంధ్రా' జిల్లాస్థాయి పోటీల్లో జామి మండల యువత పలుక్రీడల్లో సత్తా చాటారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జిల్లాస్థాయి 'ఆడుదాం-ఆంధ్రా' పోటీలు జిల్లాకేంద్రంలో నిర్వహించారు. పురుషుల క్రికెట్ పోటీల్లో ఎస్.కోట నియోజకవర్గం తరపున ప్రాతినిధ్యం వహించిన అలమండ సచివాలయం జట్టు విజేతగా నిలిచింది. వాలీబాల్ పోటీల్లో జామి సచివాలయం-3 జట్టు ద్వితీయస్థానం, విజినిగిరి సచివాలయం క్రీడాకారులు షటిల్ బ్యాడ్మింటన్‌లో విజేతగా నిలిచారు. మొదటి స్థానాల్లో నిలిచిన జట్లు జిల్లా తరపున రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. పీడీలు చంద్రశేఖర్, ఎర్రమ్మ, విజయకుమారి, శ్రీను, ఆయా సచివాలయాల కార్యదర్శులు క్రీడాకారులను అభినందించారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు



నిందితులతో ఎస్‌ఐ లక్ష్మణరావు

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట గ్రామంలోని కోర్టు కాలనీలో కర్రి కృష్ణారెడ్డి అనే ఫైనాన్స్ వ్యాపారి ఇంట్లో ఈనెల 2వ తేదీన దొంగత నానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను సోమవారం సాయంత్రం అరెస్టు చేశామని ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరా లు.. రాచకిండాం గ్రామానికి చెందిన షేక్ మీరాతో పాటు అతని మేనల్లుడు షేక్ సమీర్ ఫైనాన్సర్ కృష్ణారెడ్డి దగ్గర అప్పు తీసుకున్నారు. అప్పుతీర్చాలని ఫైనాన్సర్ వారిని ఒత్తడి చేయడంతో 2వతేదీ రాత్రి పథకం ప్రకారం 23 గ్రాముల బంగారు ఆభరణాలను అదే ఫైనాన్సర్ ఇంటిలో అపహరించారు. వీరికి రాకేష్ అనే వ్యక్తి సహకరించారు. ఇద్దరు నిందితులను గొట్లాం వద్ద పోలీసులు పట్టుకుని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్‌లు, బంగారు ఆభరణాలు, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకోని సీజ్ చేశాకు. పరారీలో ఉన్న మూడో వ్యక్తి రాకేష్ కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పారదర్శకంగా సోషల్ ఆడిట్



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

లక్కవరపుకోట: మండలంలో 2022-2023 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై పారదర్శకంగా సోషల్ ఆడిట్ చేశామని ఆపథకం పీడీ జి.ఉమామహేశ్వరి తెలిపారు.సోషల్ ఆడిట్ నివేదికలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రజావేదిక నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో రూ.19 కోట్ల విలువైన పనులు చేసినట్లు తెలిపారు. ఈ పనులపై గత 10 రోజులుగా ఆడిట్ చేయించామని చెప్పారు.గతంతో పోల్చితే ప్రస్తుతం పనులు పారదర్శకంగా సాగుతున్నాయన్నారు. ఏపీడీ శారదాదేవి,ఎంపీడీఓ కె.రూపేష్, ఏపీఓ విజయలక్ష్మి ,పీఆర్ జేఈ వీరలక్ష్మి, ఎస్‌ఆర్పీ మాధవ్ పాల్గొన్నారు.

గరిష్ట వేతనం అందేలా పనులు చేయించాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ పరమేశ్వరి

జామి: ఉపాధి హామీ వేతనదారులకు ప్రభుత్వం నిర్దేశించిన గరిష్టవేతనం రూ.272 అందేలా పనులు చేయించాలని ఉపాధి సిబ్బందికి డ్వామా పీడీ జి.పరమేశ్వరి సూచించారు. మండలంలోని గొడికొమ్ము గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను సోమవారం ఆమె పరిశీలించారు. వేతనదారుల మస్టర్ల సీట్లను తనిఖీ చేశారు. అనంతరం ఆమె వేతనదారులతో మాట్లాడుతూ సమయపాలన పాటించాలని, తాగునీరు తెచ్చుకోవాలని సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్ సీహెచ్.తారకేశ్వరరావు, క్షేత్రసహాయకుడు ఎం.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

శృంగవరపుకోట: నిరుద్యోగ యువత ఉపాధి పొందేలా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కేశవరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈశిక్షణకు ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 79956 91295, 99857 03990 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆక్రమణలను తొలగించాలని వినతి

బొండపల్లి: బోడసింగిపేటకు సమీపంలోని జాతీయ రహదారి-26కు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి బగ్గా ఆదినారాయణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఈఓపీఆర్డీ సుగుణాకరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిని ఆనుకుని ఇటీవల కొంతమంది ఇష్టానుసారం ఆక్రమణలకు పాల్పడుతున్నారని, ప్రభుత్వ స్థలాలను లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలను తొలగించాలని కోరారు.

చేపల వలలో చిక్కిన కొండచిలువ



కొండచిలువను గోనె సంచెలో బంధిస్తున్న అటవీశాఖ సిబ్బంది

గజపతినగరం: మండలంలోని పురిటిపెంటలో సరాబుల కాలనీకి చెందిన యువకులు సోమవారం చంపావతి నదిలో చేపలు పడుతుండగా వలలో కొండచిలువ చిక్కింది. వల బరువుగా అనిపించడంతో వడ్డుకు చేర్చిచూడగా అందులో సుమారు ఎనిమిది అడుగుల కొండచిలువ వారికి కనిపించింది. దాన్ని వల నుంచి బయటకు విడిచిపెట్టగా, కాలనీలోకి చొరబడడంతో స్థాని కులు బెంబేలెత్తిపోయారు. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆంధ్ర సెక్షన్ బీట్ ఆఫీసర్ సమత, సిబ్బంది అక్కడికి చేరుకొని కొండచిలువను బంధించి సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు



దత్తి గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ మహరాజన్

గజపతినగరం: గజపతినగరం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలో రబీ మొక్క జొన్నసాగు ఆశాజనకంగా ఉందని ఏడీఏ కె.మహరాజన్ తెలిపారు. గజపతినగరం మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 781 హెక్టార్లు కాగా 508 హెక్టార్లలో, దత్తిరాజేరు మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 372 హెక్టార్లు కాగా 288 హెక్టార్లలో, మెంటాడ మండలంలో సాధారణ సాగువిస్తీర్ణం 329 హెక్టార్లు కాగా 320 హెక్టార్లలో, బొండపల్లి మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 63 హెక్టార్లు కాగా 42 హెక్టార్లలో రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. రైతులకు మొక్కజొన్న సాగు సంబంధిత సలహాలు వ్యవసాయ సిబ్బంది అందజేస్తున్నారు. విత్తనం మొలకెత్తే దశ నుంచి పంట కోసే వరకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, జాగ్రత్తలు , నీటితడులు, ఎరువుల యాజమాన్యంపై సూచనలు, సలహాలు అందిస్తున్నామని ఏడీఏ తెలిపారు.